నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

రాంనగర్/ బర్కత్‌పుర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం శుక్రవారం ముషీరాబాద్, కాచిగూడ ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్లు కిషన్‌రావు, టి.రఘు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రయాణికులకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ముషీరాబాద్ డిపో 99592 26418, కాచిగూడ డిపో 99592 26130లకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయాలని వారు సూచించారు.


జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తున్న పొట్లూరు పద్మజ

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

చిక్కడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గురువారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో ఆమె ప్రారంభించారు. సరస్వతీమాత, దేశ ప్రప్రథమ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడుతూ.. లైబ్రరీల ద్వారా సమాజానికి విజ్ఞానం అందుతోందన్నారు. గ్రంథాలయాల వల్ల సమాజానికి మేలు జరుగుతోందన్నారు. గ్రంథాలయాల సేవలు అందరూ వినియోగించుకోవాలన్నారు. ఉద్యోగులు చంద్రకళ, సుబ్బలక్ష్మి, మదన్‌మోహన్, ప్రతిభారెడ్డి, ఉద్యోగుల సంఘం కార్యదర్శి మహేందర్, సుకేష్‌కుమార్, అవినాష్ రావు, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, పోటీపరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి దేవాలయం ప్రాంగణంలో గల పార్వతీక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో కార్తీకమాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ వేదపండితులు నిర్వహించారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆకాశదీపపూజ, కార్తీకపురాణ ప్రవచనాలు, భక్తులచే దీపారాధన, ప్రదోష పూజ కార్యక్రమాలు ఆలయ ఈవో లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో జరిగాయి.


సమావేశంలో మాట్లాడుతున్న మాస్టర్ దయానంద్, నర్మెట్ట మల్లేష్ తదితరులు

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకం

చిక్కడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగంలోని 341 ఆర్టికల్‌కు వ్యతిరేకమని మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మాస్టర్ దయానంద్ అన్నారు. అదే విధంగా క్రీమిలేయర్ ఎస్సీలకు వర్తించదన్నారు. డిసెంబర్ 1న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 35 లక్షల మంది మాలలతో నిర్వహించే బహిరంగసభకు మద్దతు తెలుపుతూ గురువారం ఆర్టీసీక్రాస్‌రోడ్ జవహర్‌నగర్‌లోని మాలమహానాడు సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మాలమహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా దయానంద్ పాల్గొని మాట్లాడారు. ఆర్టికల్ 341ను సవరించి ఎస్సీ వర్గీకరణ చేయాలని కేంద్రానికి సవాలు విసిరారు. సమావేశంలో మాలమహానాడు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నర్మెట్ట మల్లేష్, వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మన్నె శ్రీధర్, బల్వంత్‌రావు, ప్రవీణ్, దళిత హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు బోనగిరి మంగ, బి.లలిత, సునీత, పద్మారావు, జిఆర్ ఆనందరావు, ప్రవీణ్, నరేష్, రాజేందర్, వెంకటేశ్వర్, కృష్ణ పాల్గొన్నారు.

'టి' ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ సమావేశం రేపు

రాంనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల స్టీరింగ్ కమిటీ సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 16వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులను గుర్తించాలనీ, అమరుల కుటుంబాలను ఆదుకోవాలనీ, 250 గజాల ఇంటి స్థలంతో పాటు 4 గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలనీ, 30 వేల పింఛన్ ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. కళాకారుల బృందాలు, మహిళా సంఘాలు పాల్గొంటాయని వివరించారు.


అర్చన వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న పార్వతీశం, త్రినాథరావు

ఆకట్టుకున్న సుశీల- ఘంటసాల సినీ సంగీతోత్సవం

చిక్కడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో నిర్వహించిన సుశీల- ఘంటసాల సినీ సంగీతోత్సవం ఆకట్టుకుంది. గానకోకిల పి.సుశీల పుట్టినరోజు సందర్భంగా గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చన వెంకటేశ్వరరావు, అఖిల, లలిత, శారద, రాధారాణి, శివకుమార్, శేఖర్, నాగరాజు, కృష్ణమూర్తి తదితరులు గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా గాయకులు, నిర్వాహకులు అర్చన వెంకటేశ్వరరావును సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం త్రినాథరావు, కిన్నెర రఘురామ్‌లను సన్మానించారు.

ఆలయంలో దుకాణం లీజు కోసం ఓపెన్ టెండర్

చిక్కడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లిలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో దుకాణం లీజు, దేవస్థానానికి అవసరమైన వస్తువుల సరఫరా కోసం ఓపెన్ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కురుమ రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 28న దుకాణానికి సంబంధించిన లీజు ఓపెన్ టెండర్ ఉంటుందని వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

లగచర్ల రైతులపై పోలీసు నిర్బంధం సరికాదు

రాంనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లాలోని లగచర్ల గ్రామంతో పాటు పరిసర గ్రామాల రైతుల అరెస్టులు, నిర్బంధం కొనసాగించడాన్ని సీపీఎం (ఎంఎల్- న్యూడెమోక్రసీ) తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అధికారులపై దాడులు చేశారంటూ కొనసాగుతున్న నిర్బంధం అన్యాయమైందన్నారు. అధికారులపై దాడులు ఎవరు చేసినా ఖండించాల్సిందేనన్నారు. రైతులను ఒప్పించి వారికి న్యాయమైన పరిహారంతో పాటు ప్రత్యామ్నాయం చూపించకుండా వారి భూములను బలవంతంగా లాక్కునే వైఖరి నిరంకుశమైందన్నారు. నేతలు కె.గోవర్ధన్, వి.సంధ్య, ఎం.శ్రీనివాస్, మామిడాల భిక్షపతి, జి.అనురాధ పాల్గొన్నారు.

● నిరసన



వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై జరిగిన దాడిని నిరసిస్తూ హిమాయత్‌నగర్ తహసీల్దార్ సంధ్యారాణి ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లై ఏఎస్ఓ డి దీప్తితో పాటు రెవెన్యూ అధికారులు రఘు, విష్ణుకుమార్ సిబ్బంది పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి


బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ కాలేజీలో జరిగిన చిల్డ్రన్స్ డే వేడుకల్లో కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ, మేనేజ్‌మెంట్ సభ్యులు రోషిణి విద్యార్థులు, ఉపాధ్యాయులు


ముషీరాబాద్ ప్రభుత్వ విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తున్న విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు నరేందర్‌యాదవ్, శ్రీనివాస్‌రావు, రత్నం


విద్యానగర్‌లోని ఎస్‌పీఎస్ ఎయిడెడ్ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు కె సురేందర్, ఉపాధ్యాయులు

ఘనంగా బాలల దినోత్సవం

- మాజీ ప్రధాని నెహ్రూకు నివాళులర్పించిన నాయకులు, ప్రజలు
- పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు


విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకేషనల్ ట్రైనింగ్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థులు

రాంనగర్/ కవాడిగూడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ జయంతిని పురస్కరించుకొని గురువారం ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో ఆయన జయంతి వేడుకలు, బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యానగర్‌లోని ఎస్‌పీఎస్ ఎయిడెడ్ పాఠశాలలో కబడ్డీ, ఖో ఖో ఇతర పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ విద్యాసంస్థలో విద్యార్థులు పలు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. నల్లకుంట డివిజన్‌లోని సత్యానగర్ బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. విద్యానగర్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకేషనల్ ట్రైనింగ్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణలో ఆకట్టుకున్నాయి. రాంనగర్‌లోని ది మదర్స్, కాకతీయ స్కూల్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. కవాడిగూడ ఇంగ్లిష్ యూనియన్ స్కూల్‌లో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


బాగ్‌అంబర్‌పేటలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మణ్‌యాదవ్, ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తౌలుపునూరి కృష్ణగౌడ్, అఫ్జల్‌జీహిద్, చందు పటేల్


ముషీరాబాద్‌లోని అమన్ వేదిక రెయిన్‌బో హోం చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాలు చేసుకుంటున్న తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పారాలీగల్ వలంటీర్ వై.చంద్రమౌళి, ఈశ్వరీభాయి, సతీష్‌చంద్ర, హోమ్ నిర్వాహకులు సదాలక్ష్మి తదితరులు


హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీకేర్, నవభారత్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో చిన్నారులకు పద్మాకమలాకర్, అంబిక, సుభాషిణి పోషకాహారం, నోట్‌బుక్స్ అందజేశారు


నల్లకుంట డివిజన్‌లోని సత్యానగర్ బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కె.మురళీకృష్ణ, నాయకులు కదారి కుమార్, నాని నర్సింగ్


సుందరయ్య పార్కులో మధుమేహ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పైడి రాకేష్‌రెడ్డి, సుచరితారెడ్డి తదితరులు

మధుమేహంపై అవగాహన ఉండాలి

రాంనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మధుమేహం వ్యాధిపైన అందరూ అవగాహన కలిగి ఉండాలని పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సుచరితారెడ్డి పేర్కొన్నారు. మధుమేహ వ్యాధిని ఎంత త్వరగా గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే మేలు జరుగుతుందని చెప్పారు. ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో నైన్ స్టార్ హెల్త్ కేర్ జిజి చారిటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ, స్క్రీనింగ్, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ సుచరితరెడ్డి, రిటైర్డ్ అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. డిసెంబర్ 12వ తేదిన మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుపతి, ల్యాబ్ టెక్నీషియన్లు, స్వాతి, రమ్య, పార్కు అసోసియేషన్ అధ్యక్షుడు వివేక్, సభ్యులు కిషన్‌రావు, నాగభూషణం, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్న రమణ

మధుమేహ సమస్యల నివారణకు కృషి

చిక్కడపల్లి: మధుమేహ సంబంధిత సమస్యలను నివారించడానికి లయన్స్‌క్లబ్ కృషి చేస్తోందని లయన్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో, డయాబెటిస్ చైర్మన్ డా.జీకే రమణ తెలిపారు. వరల్డ్ డయాబెటిస్ డే సందర్భంగా గురువారం చిక్కడపల్లిలోని సాయి డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఉచితంగా మధుమేహ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాబెటిస్ టైప్-2 రిస్క్ ఉన్న వారి పరిస్థితిని కూడా మెరుగుపరిచేందుకు సహకరిస్తున్నామన్నారు. మధుమేహం గుండె, కళ్లు, మూత్రపిండాలు, పాదాలకు నష్టం కలిగిస్తుందన్నారు. లయన్స్‌క్లబ్ సర్వేలో 55 శాతం మంది ప్రజలలో మధుమేహ సమస్య పెరుగుతూ ఉండడం గమనించామన్నారు.

కార్మిక కమిషనరేట్ ఆధునికీకరణలో కృష్ణ ఆదిత్య కృషి అద్వితీయం

చిక్కడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్మికశాఖ కమిషనరేట్‌ను ఎంతో ఆధునికీకరించిన డైరెక్టర్ కృష్ణ ఆదిత్య సేవలు అద్వితీయమని పలువురు కార్మికశాఖ అధికారులు పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు కార్యదర్శిగా కృష్ణ ఆదిత్య బదిలీ అయిన సందర్భంగా ఆయనకు గురువారం కార్మికశాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికి సన్మానించారు. కార్మికశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్ డా. ఇ.గంగాధర్ మాట్లాడుతూ.. కృష్ణ ఆదిత్య తన దూరదృష్టి, నాయకత్వం, అవిశ్రాంత ప్రయత్నాల ద్వారా కార్మికశాఖ కమిషనరేట్ ఆధునీకరణలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ ఆఫీస్ అమలు, ఈ ఆఫీస్ చొరవ, ప్రక్రియలను క్రమబద్ధీకరించేందుకు కృషి చేశారన్నారు. సంయుక్త కమిషనర్లు చంద్రశేఖరం, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సునీత, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.


కృష్ణ ఆదిత్యను అభినందిస్తున్న కార్మికశాఖ అధికారులు

ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ మొదటి విడత చిత్రాల ప్రదర్శన రేపు


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రామచంద్రారెడ్డి

రాంనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి విడత చిత్రాల ప్రదర్శన 16న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు పులగం రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 20నవిశాఖపట్నంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మొదట సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 16వతేదీ సాయంత్రం 6 గంటలకు చిత్ర ప్రదర్శన ప్రారంభం అవుతుందని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఇన్ ద లాఫ్ (మలయాళం) 6.30 డెడ్‌ఎండ్ (తెలుగు), 7 గంటలకు సుమా (కన్నడ), 7.30 గంటలకు క్యాసెరాసె (తెలుగు) 8 గంటలకు బల్వంత్ (హిందీ), 8.30 గంటలకు సాగరవాసి (తెలుగు), 8.45 గంటలకు త్రికాలం (కన్నడ) తదితర చిత్రాలను ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నటుడు, దర్శకుడు తనికెళ్ల భరణి, దాశరథి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు వినయకుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో వినయకుమార్, దాశరథి ఫిలిం సొసైటీ కార్యదర్శి ఎల్ సత్యనారాయణ హిందీ చిత్ర దర్శకుడు కపిల్ జోన్ థాలే, హెచ్ ఆర్ దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటలో పనులను నిలిపివేయాలని కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు

ఎడ్ల సుధాకర్‌రెడ్డి

రాంనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ కుంట స్థలంలో హైడ్రా చేపట్టిన పనులను నిలిపివేయాలని కోర్టు స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చినట్లు స్థల యజమానిగా పేర్కొంటున్న బీఆర్ఎస్ అంబర్‌పేట ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైడ్రా నిబంధనలకు విరుద్ధంగా తమ స్థలంలోకి వచ్చి చదును చేసే పనులు చేపట్టడాన్ని సవాల్‌చేస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. కోర్టు స్పందించి ఫర్‌దర్ ఆర్డర్ వచ్చేంత వరకు పనులను నిలిపి యథావిధి స్థితిని కొనసాగించేలా కోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ఎంపీ వి హనుమంతరావు తనపై కక్షతోనే హైడ్రాకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు ఈ స్థలాన్ని తాను అజామ్‌ఖాన్ నుంచి కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు.

'రిజర్వేషన్‌లపై ప్రధాని స్థాయికి తగ్గట్లుగా మాట్లాడడం లేదు'

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీతన స్థాయికి దిగజారి రిజర్వేషన్లపై మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హనుమంతరావు (వీహెచ్) ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో రాహుల్ గాంధీ రిజర్వేషన్‌కు వ్యతిరేకం అని మోదీ అన్నారని, తాజాగా రాజీవ్‌గాంధీ రిజర్వేషన్‌కు వ్యతిరేకం అంటున్నారని ఆరోపించారు. ఎప్పుడో చనిపోయిన రాజీవ్‌గాంధీపై ఇప్పుడు బీజేపీ రాజకీయమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రధాని ఓబీసీ నాయకుడిగా రిజర్వేషన్లకు అనుకూలమా? వ్యతిరేకమా చెప్పాలని హన్మంతరావు డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి తన స్థాయికి దిగజారి మాట్లాడుతున్నారన్నారు. బీజేపీలోని బీసీ నాయకులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు కుల గణనకు, రిజర్వేషన్లకు అనుకూలమా? వ్యతిరేకమా చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ అదనపు చార్జీలు ఉపసంహరించాలి : వీహెచ్‌పీ

హైదరాబాద్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులలో అదనపు చార్జీలు ఉపసంహరించాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం వీహెచ్‌పీ నాయకులు రామరాజు, రావినూతల శశిధర్, జగదీశ్వర్‌లతో కూడిన ప్రతినిధి బృందం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ.సజ్జనార్‌కు ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.

అపార్ట్‌మెంట్‌లో పైపులు చోరీ చేస్తున్న వ్యక్తికి దేహశుద్ధి

బర్కత్‌పుర, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్లలో పైపుల దొంగతనానికి యత్నించిన ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. తిలక్‌నగర్‌లోని విశిష్ట హైట్స్‌లో గురువారం ఓ వ్యక్తి పైపులను కట్ చేస్తున్నాడు స్థానికులు చూసి అతడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. కాచిగూడ పోలీసులకు సమాచారం ఇచ్చి అతనిడి పోలీసులకు అప్పగించారు. స్థానికులు గమనించారని భావించిన అతను బ్లేడ్‌తో రెండు చేతులను కోసుకున్నాడు. రక్తస్రావం కావడంతో అతడిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు సీఐ చంద్రకుమార్ తెలిపారు.

రైలు ప్రయాణికురాలి నగదు బ్యాగు చోరీ

బర్కత్‌పు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ ఉస్సేని ఆలంకు చెందిన మెహర్ భాను జహీ వృద్ధురాలు. లాల్‌ఘర్ ఎక్స్‌ప్రెస్ రైలులో సూరత్ నుంచి కాచిగూడకు వస్తోంది. బాసర రైల్వే స్టేషన్ వద్ద తన బ్యాగ్ కనిపించలేదు. బాగులో పదివేల రూపాయల నగదు ఒక సెల్‌ఫోన్ ఉన్నట్లు తెలిపారు. రైలు దిగిన అనంతరం గురువారం రాత్రి కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

● 'కార్తీక' సందడి



కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని చిక్కడపల్లి, గాంధీనగర్ మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అభిషేకం సంబంధించిన పూజా సామగ్రి, పూలు, ఉసిరికాయలు కొనుగోలు చేసేందుకు మహిళలు మార్కెట్‌కు పోటెత్తారు. దీంతో చిక్కడపల్లిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. -రాంనగర్, ఆంధ్రజ్యోతి


ప్రతిభా పారితోషిక బహుమతిగ్రహీతలతో అతిథులు

ప్రతిభా పారితోషిక పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో గురువారం ప్రతిభ పారితోషిక పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో ప్రముఖులైన హమీద్, సుప్రియచక్రవర్తి, వేణుగోపాలరావు, శేషభట్టార్ రజితాచార్య, మృదుల కడియాల, లలితారాజ్, రవిలకు నగదు పురస్కారాలు బహూకరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న కళాపోషకులు వడ్డకొండ వెంకటరావు, రచయిత జానీబాషా, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ జీవీఆర్ సంస్థ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ వివిధ రంగాల వారిని ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ గిరిజనులను విడుదల చేయాలి

- త్వరలో 'చలో కొడంగల్' ● గిరిజన సంఘాల జేఏసీ నేతల హెచ్చరిక


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా సంజీవ్‌నాయక్, ప్రొ.నారాయణ, జేఏసీ నేతలు

రాంనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ఫార్మా కోసం గిరిజనుల భూములను ప్రభుత్వం దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాలను వెంటనే విరమించాలని గిరిజన సంఘాల జేఏసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తనపై దాడి జరగలేదని జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించినప్పటికీ ప్రభుత్వం కుట్రపూరితంగా లంబాడీ రైతులపై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేసిందని ఆరోపించారు. గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకొని అందరిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో 'కొడంగల్ ఫార్మా- భూముల కేటాయింపు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్, ప్రొఫెసర్ నారాయణ, గణేష్‌నాయక్, మోతీలాల్, శంకర్‌నాయక్‌తో పాటు పలువురు మాట్లాడారు. ఫార్మాసిటీ కోసం గిరిజనుల వ్యవసాయ భూములను తీసుకునే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. వచ్చే సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి గిరిజనుల చలో కొడంగల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకించారు. సమావేశంలో గిరిజన జేఏసీ నాయకులు రాంబాబు నాయక్, రాజునాయక్, హరినాయక్, రాథోడ్, విద్యాకృష్ణ, శ్రీనివాస్‌నాయక్, కల్యాన్‌నాయక్, మోహన్, బిక్షనాయక్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం


వ్యక్తి మృతదేహం

కవాడిగూడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ పీఎస్ పరిధిలోని న్యూబోయిగూడలోని ఫ్లోరాహోటల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గాంధీనగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వ్యక్తి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. సమాచారం తెలిసిన వారు గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో గాని లేదా ఫోన్ నెంబర్ 87126 60140లో తెలియజేయాలని సీఐ రాజు కోరారు.